## క్లుప్తంగా

### దత్తాత్రేయుడికి విశేషపూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయ స్వామికి గురువారం ఈఓ లవన్న ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

### అభివృద్ధి నివేదికలు అందించండి

పగిడ్యాల: వచ్చే నెల ఒకటో తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నందున ఆయా శాఖల మండల స్థాయి అధికారులు ఈనెల 25లోగా అభివృద్ధి నివేదికలను తమకు సమర్పించాలని ఎంపీడీఓ వెంకటరమణ గురువారం సూచించారు. మండల వ్యాప్తంగా జరిగే అభివృద్ధి పనులపై ప్రజాప్రతినిధులకు ముందస్తు నివేదికలు ఇవ్వాల్సి ఉందన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, గైర్హాజరైతే శాఖాపరమైన చర్యల నిమిత్తం జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామన్నారు.

### నీటి ఎద్దడి నివారణకు చర్యలు

పగిడ్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఈఓఆర్డీ పుల్లయ్య తెలిపారు. గురువారం పగిడ్యాల పంచాయతీ పరిధిలోని నల్లవాగు సమీపంలో అడుగంటిపోయిన బోర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో బోర్లకు మరమ్మతులు చేయించి తాగు నీటి సమస్యను పరిష్కరించనున్నట్లు చెప్పారు.

### సన్మానం



సాంబయ్యను సన్మానిస్తున్న నాయకులు

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని శ్రీకృష్ణదేవరాయ తెలగ, కాపు, బలిజ నిత్యాన్నదాన సత్రం నూతన ప్రధాన కార్యదర్శి పుష్పాల సాంబశివరావును గురువారం శివోహం టెంపుల్ ట్రస్ట్ అధ్యక్షులు అంతిరెడ్డి అరవింద్‌రెడ్డి హరిహర సేవా ఆశ్రమం నిర్వాహకులు హరికృష్ణస్వామి, బీజేపీ ఎస్సీ నాయకులు దరివేముల శ్రీనివాస్, ఎస్టీ నాయకులు రాములు నాయక్, పోలయ్య, మల్లికార్జున తదితరులు సన్మానించారు. అనంతరం క్షేత్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. సత్రం నూతన ప్రధాన కార్యదర్శి సాంబయ్య మాట్లాడుతూ బలిజ సత్రానికి వచ్చే భక్తులు, యాత్రికులకు ఉచితభోజన సదుపాయాన్ని కల్పిస్తామన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

మహానంది: తమ్మడపల్లె గ్రామంలో అగ్నిప్రమాదానికి గురై పశువుల పాక దగ్ధమైన సంఘటనలో మదార్‌వలికి చెందిన ఎద్దులు మరణించి ఆర్థికంగా నష్టపోయిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచనల మేరకు గురువారం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ధర్మకర్త బుసకాని వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు నాగేశ్వరరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ శివయ్య పాల్గొన్నారు.

### బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు నగదు అందజేస్తున్న నాయకులు

జూపాడుబంగ్లా: రెండు రోజుల క్రితం అగ్నిప్రమాదంలో నష్టపోయిన పండ్ల వ్యాపారులకు శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. నగదును గురువారం సాయంత్రం కౌన్సిలర్లు రాధిక, రాజశేఖరప్ప, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శివరామకృష్ణారెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు యుగంధర్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, సొసైటీ చైర్మన్ తులసిరెడ్డి, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి బాధితులకు అందజేశారు.

### 25 నుంచి స్పెషల్ డ్రైవ్

నంద్యాల(రూరల్): పట్టణంలోని డీ-2 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 25వ తేదీ నుంచి పెండింగ్ విద్యుత్ బిల్లులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏఈ రామయ్య గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు ఈ నెల 24వ తేదీ లోపు బిల్లులు చెల్లించాలని చెప్పారు.

# సొంతింటి కల సాకారం దిశగా..

పేదల సొంతింటి కల త్వరలో సాకారం కానుంది. జగనన్న కాలనీలలో గృహనిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే కొందరు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రవేశాలకు ఎదురు చూస్తూ ఉండగా.. మరికొందరి ఇళ్ల నిర్మాణాలు చివరి దశలో ఉన్నాయి. మరోవైపు ప్రభుత్వం కూడా జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టింది. రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లలో ఆయా శాఖల అధికారులు బిజీగా ఉన్నారు. ఉగాది నాటికి లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయించేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు.

– ఆత్మకూరు

- జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం
- మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు
- ప్రవేశాలకు సిద్ధమవుతున్న లబ్ధిదారులు



జగనన్న కాలనీలో వేగవంతంగా పూర్తవుతున్న పక్కాగృహం

శ్రీశైలం నియోజకవర్గానికి జగనన్న కాలనీలలో దాదాపు 9,489 గృహాలు మంజూరయ్యాయి. అందులో ఆత్మకూరు మండలానికి 4,415, వెలుగోడుకు 2,081, మహానందికి 1,574, బండిఆత్మకూరు మండలానికి 1,419 చొప్పున ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఇప్పటికే 3,061 ఇళ్లు నిర్మాణాలు పూర్తి చేసుకుని ప్రవేశాలకు సిద్ధంగా ఉన్నాయి.

**అన్ని హంగులతో..**

జగనన్న పక్కాగృహాల లబ్ధిదారులు అన్ని హంగులతో గృహాలను నిర్మించుకుంటున్నారు. కిచెన్, బెడ్‌రూంతో పాటు వరండా, కాంపౌండ్ నిర్మించుకుంటున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఇసుక, సిమెంట్, ఇనుప కడ్డీలతో పాటు లబ్ధిదారులు మరి కొంత సొంత సొమ్మును ఉపయోగించి అన్ని హంగులతో నూతన గృహాలను నిర్మించుకుంటున్నారు.

**మరింత వేగం..**

జగనన్న కాలనీలలో లబ్ధిదారుల కోసం ప్రభుత్వం ఎన్నో సదుపాయాలు కల్పించింది. ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.1,80,000 మంజూరు చేయడంతో పాటు ఇసుక, సిమెంట్, కడ్డీలను అందిస్తోంది. ఇక అంతర్గత రోడ్లు, విద్యుత్ సరఫరా, వీధి దీపాలు, తాగునీటి కోసం బోర్లు, ట్యాంక్‌లు ఏర్పాటు చేసింది. అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తుండటంతో లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఆత్మకూరు పట్టణంలో చక్రం హోటల్ వెనుక 1,502 , దుద్యాల రస్తాలో 777, మైనార్టీ కాలనీలో 367, సొంత స్థలాల్లో 209 మంది లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటున్నారు. బిల్లులు సైతం నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తుండటంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా గృహాలను వేగవంతంగా పూర్తి చేసుకుంటున్నారు.

**శ్రీశైలం నియోజకవర్గంలో మంజూరైన గృహాలు**

| మండలాలు | మంజూరైన గృహాలు | పూర్తయిన గృహాలు |
|---|---|---|
| ఆత్మకూరు(పట్టణం) | 3,452 | 1,399 |
| ఆత్మకూరు మండలం | 963 | 392 |
| వెలుగోడు | 2,081 | 410 |
| మహానంది | 1,574 | 350 |
| బండిఆత్మకూరు | 1,419 | 510 |

### ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



పక్కాగృహం మంజూరు కావడంతో నిర్మాణం చేపట్టాం. చివరి దశకు చేరుకుంది. త్వరలో ఇంట్లోకి ప్రవేశించనున్నామనే సంతోషం అంతాఇంతా కాదు. మాలాంటి పేదలను ఇంటి వాళ్లను చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు – జయప్రద, ఆత్మకూరు

### త్వరలో ఇంట్లో చేరుతాం



జగనన్న కాలనీలో ఇంటిని నిర్మించుకుంటున్నాం. ప్రభుత్వం అందించిన రూ.1,80,000 లతో ఇంటి నిర్మాణం చేపట్టాం . స్లాప్‌లెవల్ కూడా పూర్తయింది. మరో ఒకటి, రెండు నెలల్లో కొత్త ఇంట్లోకి చేరుతాం. సొంతింటి కలను నెరవేర్చిన జగనన్నను జీవితంలో మరువం.

– ముంతాజ్, ఆత్మకూరు

### బిల్లులకు ఇబ్బంది లేదు



జగనన్న పక్కా గృహాల లబ్ధిదారులకు బిల్లులు ఎప్పటికప్పుడే మంజూరు చేస్తున్నాం. బేస్‌మెంట్, రెంటల్, స్లాబ్‌లను పరిశీలించి బిల్లులు విడుదల చేస్తున్నాం. ఎవరైనా లబ్ధిదారులు గృహాలు నిర్మించుకుంటూ బిల్లులు కాకపోతే మా దృష్టికి తీసుకురావాలి. మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటాం. – ఉమామహేశ్వర రెడ్డి, హౌసింగ్ ఏఈ, ఆత్మకూరు

### సిబ్బంది సేవలు ప్రశంసనీయం

- ఈఓ ఎస్ లవన్న



ఉద్యోగులతో ఈఓ లవన్న

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఉద్యోగుల సేవలు ప్రశంసనీయమని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వాహణాధికారి ఎస్ లవన్న అన్నారు. గురువారం దేవస్థాన కార్యాలయ భవనంలోని సమావేశ మందిరంలో ఉద్యోగులతో సమావేశమై అన్ని విభాగాల సిబ్బందిని అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ సమష్టి కృషితోనే బ్రహ్మోత్సవాలు విజయవంతంగా ముగిశాయన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ దిశానిర్దేశంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవాలు పూర్తి చేశామన్నారు. దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు కూడా సహాయ సహకారాలు అందించారన్నారు. అనంతరం ఉద్యోగులకు, అర్చకస్వాములకు, వివిధ విభాగాల అధికారులకు స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదాలు అందజేసి సత్కరించారు.

### వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలి

పగిడ్యాల: పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు ఓటర్లను అభ్యర్థించారు. గురువారం మండలంలోని పడమర ప్రాతకోటలో పట్టభద్రులతో ముఖాముఖీ సమావేశమై ప్రచారం నిర్వహించారు. వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అధిక మెజారిటీలో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ బి.శ్యామలమ్మ, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, సింగిల్ విండో డైరెక్టర్ దివాన్‌సాహెబ్, ఉప సర్పంచ్ లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షలంటే భయపడొద్దు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చిత్రలేఖ

ఆత్మకూరు: పరీక్షలంటే భయపడొద్దని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం చిత్రలేఖ విద్యార్థులకు సూచించారు. స్థానిక పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల పట్ల గురువారం అవగాహన కల్పించారు. పరీక్షలు సమీపిస్తుండటంతో ప్రణాళిక వేసుకుని చదువుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులు అరుణాచలంరెడ్డి, షంషుద్దీన్ మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్ట్‌లలో సులభంగా మార్కులు సాధించే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్‌రెహమాన్, మయూర్ షేక్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా విడుదల

మిడుతూరు: వచ్చే నెలలో జరిగే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా మండల వ్యాప్తంగా ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఓటర్ల జాబితాను గురువారం ఎంపీడీఓ కార్యాలయం నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి తెలిపారు. మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలు, జెడ్పీటీసీ స్థానం ఒకటి ఉన్నట్లు ఎంపీడీఓ తెలిపారు. జాబితాపై అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

బండిఆత్మకూరు: ప్రభుత్వం జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారిణి స్వాతి తెలిపారు. జొన్న సాగు చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్వింటాకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2,970 ఇస్తున్నట్లు తెలిపారు. సంచులు, హమాలీ ఖర్చులు, రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున, అత్యధికంగా వంద క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తుందన్నారు.

# జగనన్నతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

- నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సమాజిక న్యాయం సాధ్యమైందని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకుగా వినియోగించుకోగా.. జగనన్న ఉన్నత పదవులిచ్చి గౌరవిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11 స్థానాలను బీసీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి ఎస్టీలకు కేటాయించడమే అందుకు నిదర్శనమన్నారు. ఎవరైనా ఎస్సీలుగా పుట్టాలనుకుంటారా అంటూ దళితులను చంద్రబాబునాయుడు కించపరిచారన్నారు. మంత్రి వర్గంలో 70 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించిన ఘనత జగనన్నదే అన్నారు. అలాగే రాజ్యసభ, శాసనసభ, జెడ్పీ చైర్మన్ స్థానాల్లో 69 శాతం, నగర మేయర్లుగా 86 శాతం, మున్సిపల్ చైర్మన్లుగా 648 స్థానాలకు గాను 431స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు కేటాయించినట్లు తెలిపారు. కార్పొరేషన్ చైర్మన్లుగా 58 శాతం బడుగు, బలహీనవర్గాల వారినే నియమించారన్నారు. రాజకీయ గుర్తింపు కోసం ప్రతిపక్షాలు నోటికొచ్చినట్లు విమర్శలు చేయటం తగదన్నారు. పట్ట భద్రుదల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు గంగిరెడ్డి రమాదేవి, రామసుబ్బయ్య, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ మొల్ల రబ్బాని, సొసైటీ చైర్మన్ సగినేల హుసేనయ్య, కౌన్సిలర్లు జాకీర్‌హుసేన్, దేశెట్టి సుమలత, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

– పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి విజయానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆర్థర్ సూచించారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రవీంద్రారెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు.

## ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

బండిఆత్మకూరు/పాములపాడు: ఇంటర్మీడియెట్ విద్యను మధ్యలో ఆపేసిన విద్యార్థులు ఓపెన్ స్కూల్ ద్వారా పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 27వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని బండిఆత్మకూరు, పాములపాడు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వెంకటనారాయణ, వెంకటేశ్వర్లు తెలిపారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తులను కళాశాలల్లో సమర్పించాలన్నారు.

## జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): ఈ నెల 25వ తేదీన విజయవాడలో ఆదివాసీల హక్కులు, అటవీ సంపద పరిరక్షణకు కోసం జరిగే రాష్ట్ర సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి శంకర్ కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశం లో ఆయన మాట్లాడారు.

# మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం



మాట్లాడుతున్న ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి. చిత్రంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి

మహానంది: అన్నిశాఖల అధికారుల కృషితో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతమయ్యాయని మహానందీశ్వరస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో అన్నిశాఖల అధికారులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అందరి సహకారంతో శివరాత్రి ఉత్సవాలు విజయవంతం అయ్యాయన్నారు. త్వరలో జరగనున్న ఉగాది ఉత్సవాల సందర్భంగా కన్నడ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ముఖ్య అతిథి, దాత శిల్పా భువనేశ్వరరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో పండితులు రవిశంకర అవధాని, ఆలయ ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జున శర్మ, ఉప ప్రధానార్చకులు వనిపెంట జనార్దనశర్మ, జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ జనార్దన్‌శెట్టి తదితరులు పాల్గొన్నారు.

# అప్పర్‌భద్ర ప్రాజెక్టును అడ్డుకుందాం



మాట్లాడుతున్న స్టీరింగ్ కమిటీ సభ్యులు రమణారెడ్డి

బండిఆత్మకూరు: అపర్‌భద్ర ప్రాజెక్టును అడ్డుకోకపోతే రాయలసీమ ఎడారిగా మారుతుందని రాయలసీమ సాగునీటి సాధన సమితి స్టీరింగ్ కమిటీ సభ్యుడు బ్రహ్మారెడ్డి తెలిపారు. గురువారం బండిఆత్మకూరులో రైతు సంఘాల ద్వారా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో కర్ణాటక ప్రభుత్వం అపర్‌భద్ర ప్రాజెక్టును అక్రమంగా నిర్మిస్తుందన్నారు. వలసలకు నిలయమైన రాయలసీమకు గుక్కెడు నీరు అందే పరిస్థితి లేదన్నారు. సిద్దేశ్వరం వద్ద కృష్ణానదిపై తీగల వంతెన బదులు బ్యారేజ్ కం వంతెన నిర్మిస్తే సంఘమహేశ్వరం వద్ద 70 టీఎంసీల నీరు నిల్వ ఉండే అవకాశం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ఆర్‌డీఎస్ నుంచి ఆదోని వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు.

# భూములిచ్చే రైతులకు రూ.10 లక్షల పరిహారం



రైతులతో చర్చిస్తున్న ఆర్డీఓ, మైనర్ ఇరిగేషన్ అధికారులు

కొత్తపల్లి: జి.పుల్లారెడ్డి చెరువు కింద పంట కాలువల ఏర్పాటు కోసం భూములిచ్చే రైతులకు ప్రభుత్వం నుంచి ఎకరాకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని ఆత్మకూరు ఆర్డీఓ దాసు తెలిపారు. గురువారం లింగాపురం గ్రామ సమీపంలో చెరువు కింద కోల్పోతున్న భూములను మైనర్ ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డి, డీఈ జయరాములు, ఏఈ నాగన్నలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రైతులతో మాట్లాడుతూ చెరువు కింద 750 ఎకరాల ఆయకట్టు ఉందన్నారు. ఆయకట్టుకు సాగు నీరు అందాలంటే చెరువుకు కుడి, ఎడమ వైపున పంట కాలువలు ఏర్పాటు కోసం 39 మంది రైతుల నుంచి 16.17 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. రైతులు చర్చించుకుని ముందుకు వస్తే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందేలా చూస్తామన్నారు. కాగా కొంతమంది రైతులు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున ఇవ్వాలని ఆర్డీఓకు విన్నవించారు.

# తప్పుడు రాతలను సహించేది లేదు

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

జూపాడుబంగ్లా: తప్పుడు కథనాలు, ప్రభుత్వంపై బురద జల్లే వార్తలు రాస్తే సహించేది లేదని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ మండి పడ్డారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మొల్ల రబ్బానితో కలిసి ఆయన గురువారం నందికొట్కూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఈనాడు ప్రతులను దహనం చేశారు. అలాగే జెడ్పీటీసీ సభ్యులు పోచా జగదీశ్వరరెడ్డి, పర్వతనేని యుగంధర్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం నుంచి పటేల్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఈనాడు దినపత్రి ప్రతులను దహనం చేశారు. ఎమ్మెల్యే ఆర్థర్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రి చేయాలనే ఉద్దేశంతో రామోజీరావు ప్రభుత్వంపై తప్పుడు కథనాలు రాయటం సరికాదన్నారు. పట్టాభినీ కొట్టారంటూ పాత ఫొటోలతో ప్రచురించడం జర్నలిజానికే మాయని మచ్చ అన్నారు. ప్రభుత్వంపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న ఈనాడు రామోజీరావుపై చర్యలు తీసుకోవటంతోపాటు ప్రతికను బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తువ్వా శివరామకృష్ణారెడ్డి, సొసైటీల చైర్మన్లు తులసిరెడ్డి, సగినేల హుసేనయ్య, లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి, కౌన్సిలర్లు చిన్నరాజు, నాయక్, రావూఫ్, లాలూ, చాంద్‌బాషా, రాధికమ్మ, దేశెట్టి సుమలత, కోఆప్షన్ సభ్యుడు గఫార్, వైస్ ఎంపీపీ నబీరసూల్, విద్యార్థి నాయకుడు సురేష్, కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు గంగిరెడ్డి రమాదేవి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఈనాడు ప్రతుల దహనం



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న మండల నాయకులు

మహానంది: సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ఈనాడు పత్రిక అసత్య కథనాలను ప్రచురిస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, కన్వీనర్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి విమర్శించారు. తమ్మడపల్లె గ్రామంలో గురువారం ఈనాడు ప్రతులను కాల్చివేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. నిరసనలో మహానంది ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ ధర్మకర్త బండి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# పందుల సంచారాన్ని అరికట్టండి



ఎంపీడీఓతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

బండిఆత్మకూరు: మండల కేంద్రంలో పందుల సంచారాన్ని అరికట్టాలని మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచు అవుటాల నాగేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ వాసుదేవ గుప్తాకు బండిఆత్మకూరు గ్రామ రైతులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పందుల సంచారం వల్ల పంటలు సాగు చేసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో కూడా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. అధికారులు స్పందించి పందుల సంచారాన్ని అరికట్టి పంటలతో పాటు ప్రజల ఆరోగ్యాలను కూడా కాపాడాలన్నారు. కార్యక్రమంలో దేసు మనోహర్‌రెడ్డి, సీమ అంకిరెడ్డి, అవుటాల సుబ్బారెడ్డి, బైరెడ్డి మధు, తిమ్మారెడ్డి, సీమ రామిరెడ్డి, నందిపాటి రామచంద్రారెడ్డి, బైరెడ్డి అశోక్‌రెడ్డి, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు.

# ఇళ్ల స్థలాల లేఅవుట్‌లకు జియో ట్యాగింగ్



జియో ట్యాగింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ మేరి

కొత్తపల్లి: మండల కేంద్రం శివారులోని జగనన్న కాలనీలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు చేపట్టిన జియో ట్యాగింగ్ ప్రక్రియను గురువారం ఎంపీడీఓ మేరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులు, ఇళ్ల స్థలాలు తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు అలసత్వం వహించకుండా త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ వలి, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.